# మళ్ళీ చెప్పిన కథలు



రావి కొండలరావు

## ఏడో చేప

అనగా అనగా రాజుగారికి ఏడుగురు కొడుకులు. ఏడుగురూ "ఏకతాడు" మీద నడిచి చేపల వేట కెళ్లారు. మనిషికో చేప చొప్పున ఏడు చేపలే పట్టారు; ఏడూ పట్టుకొచ్చి ఎండబెట్టారు. ఆరు చేపలు ఎండిపోయాయిగాని ఏడో చేప మాత్రం ఎండకుండా కూచుంది. ఏడో రాకుమారుడు చూశాడు. చూసి నిలదీసి అడిగాడు —

"చేపా చేపా! ఆరూ ఎండిపోయాయి గాని. ఏడోదానివి నువ్వెందుకని ఎండలేదు."

"ఎండలేదు."

"నా మాటే నాకు వప్పజెప్పుతున్నావు- జాగర్త! నాకో్కపం వచ్చిందంటే నదిసముద్రంలోకి విసిరేస్తాను నిన్ను. కారణం చెప్పు!" అని గద్దించాడు.

"సప్తముండా విను. గడ్డికుప్ప నాకు చాటు వచ్చింది. ఏంచేసేది?" అన్నది చేప.

సప్తముడు ఓ చేత్తో చేపను పుచ్చుకుని కోపంతో గడ్డికుప్ప దగ్గరకెళ్ళాడు.

"గడ్డికుప్పా! గడ్డికుప్పా! ఈ నా చేప మీద ఎండ పడకుండా అడ్డు రావడానికి నీకెన్ని గుండెలు? రాకుమారుడి చేప అని తెలిసి కూడా ఎందుకని చాటు వచ్చావు?" అని గట్టిగా అడిగాడు.

"నేనేం చెయ్యను యువరాజా! ఆవు మెయ్యలేదు." అంది గడ్డికుప్ప వినయంగా అగస్త్యుడి ముందు వింధ్య పర్వతం వంగినట్టు వంగి.

రాకుమారుడు రంయ్ మని ఆవు దగ్గర కెళ్ళి "ఆవూ ఆవూ! ఎందుకని గడ్డి మెయ్యలేదు? నువ్వేం కామధేనువు ననుకుంటున్నావా ఆకల్లేదని చెప్పడానికి! వీల్లేదు. చెప్పు! ఎందుకని మెయ్యలేదు?" అని కళ్ళెర్రచేశాడు.

"పశుకాపరి పాపయ్య నన్ను విప్పలేదు. నేనేం చెయ్యను?" అంది ఆవు.

సప్తముడు అగ్గి బుగ్గయిపోయాడు. పశుకాపరి పాపయ్యని పిలిపించి, కత్తి ఝుళిపించాడు.

"పశు కాపరి పాపయ్యా పశు కాపరి పాపయ్యా! గడ్డి మెయ్యడానికి ఆవుని ఎందుకని విప్పలేదు? పడుకుని నిద్దరోతున్నావా?"

"లేదు యువరాజా! నా కొడుకు పొద్దుట్నుంచీ ఒకటే ఏడుపు. వాడిని ఊరో్కబెట్టడం నావల్ల కావడంలేదు. వాడిని వూరుకోబెట్టి ఆవుని విప్పాలనుకున్నా. కాని వాడు ఏడుపు మానడంలేదు."

"ఏమిటి వాడి ఏడుపు? నా ముందుకొచ్చి ఏడవమను" అన్నాడు ఏడవ యువరాజు.

పెద్దగా ఏడుస్తూ వచ్చాడు పాపయ్య కొడుకు.

"పాపయ్య కొడుకూ! పాపయ్య కొడుకూ! ఎందుకురా అంతంత రాగాలు తీస్తూ అలా ఏడుస్తున్నావు? ఏం జరిగింది?"

"చీచీచీ.... చీమ.... కుకుకు కుట్టింది...." అని పన్నెండున్నర శ్రుతిలో అందుకున్నాడు ప. కా. పా. కొడుకు.

"చీమా?....చిన్న చీమా! అది నిన్ను కుట్టిందిరా?" అని చీమలపుట్ట దగ్గర కెళ్ళి దూరంగా నిలబడి అడిగాడు రా. కు.

"చీమా! చీమా.... ప.కా.పా. కొడుకుని ఎందుకు కుట్టావు?"

"నా పుట్టలో వేలుపెడితే నేను కుట్టక, ముద్దెట్టుకుంటానా?" అంది చీమ.

"వేలు పెట్టినంతమాత్రాన కుడతావా?.. అసలు, అలా కుట్టడానికి, నీకు శివుడాజ్ఞ వుందా?"

"ఉంది. కావాలంటే అడుగు."



రాకుమారుడు ఆగలేదు. అయితే అయిందని కైలాసం వెళ్ళి, పార్వతీదేవితో కలిపి నాట్యం చేస్తున్న శివుడిని 'ఆగు'మని గద్దించాడు. శివుడు ఆగిపోయి పార్వతి వంక చూశాడు; పార్వతి శివుడివంక చూసింది. ఇద్దరూ కలిసి సప్తముడి వంక చూశారు.

"శివుడూ శివుడూ! ఫలానా చీమ ప. కా. పా. కొడుకుని కుట్టింది. అలా కుట్టడానికి నువ్వు ఆజ్ఞ ఇచ్చావా?"

శివుడు నల్లబోయి పార్వతి వంక చూశాడు. పార్వతి తెల్లబోయి రా.కు.వంక చూసింది.

"ఏమిటీ.... నా ఆజ్ఞా!.... చీమ కుట్టడానికి నా ఆజ్ఞ కావాలా.. నాకేం పనిలేదా. పోవయ్యా పో..ఒక చిన్న చీమ కుట్టడానికి కూడా నా ఆజ్ఞ కావాలిట. అర్థం పర్థంలేని సామెతలూ మీరునూ.. పో!"

"పోతే ఎలాగండీ? ఈ నా చేప ఎండలేదే. ఎండే మార్గం చెప్పండి."

శివుడు ఫక్కున నవ్వాడు. పార్వతి చేపను చూసింది. ఆమె కళ్ళు మెరిశాయి. తన కళ్ళు ఆ ఆకారంలో వుండాలని మనసులో కోరుకుంది. రాకుమారుడి చేతిలోని చేప మాయమైంది. ఇంకో చేప అలాంటిదే సృష్టింపబడి అదీ మాయమైంది. పార్వతీదేవి "మీనాక్షి" అయింది. రాకుమారుడు భూలోకం వచ్చేసి. బజార్లో ఎండిన చేపను కొనుక్కున్నాడు.

